

నవతెలంగాణ
కరీంనగర్
శనివారం | నవంబర్ 18, 2023 | www.navatelangana.com

ప్రగతికి పట్టం కట్టండి

- పదేండ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాం
- దేశంలోనే నెంబర్‌వన్ స్థానానికి ఎదిగాం
- ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజలు పరిణితితో ఆలోచించాలి
- కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను పసిగట్టి ఓటుతో బుద్ధిచెప్పాలి
- మా అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి
- కరీంనగర్, గంగాధర, జమ్మికుంట సభల్లో సీఎం కేసీఆర్

'తెలంగాణ రాక ముందు అరిగోసపడ్డాం. తాగు, సాగునీళ్లులేక, కరెంటు రాక తిప్పలు పడ్డాం. రాష్ట్రం ఏర్పడ్డాక కఠోర శ్రమకోర్చి బలమైన పునాదులు వేసుకుని ఆ కష్టాలన్నీ దూరం చేసుకున్నాం. ప్రగతిపథంవైపు నడుస్తున్నాం. దేశంలోనే వరి పండించే రాష్ట్రాల్లో పంజాబ్‌ను దాటి నెంబర్‌వన్‌స్థానానికి ఎదిగాం. మిగతా ప్రగతిలోనూ ర్యాంకులు సాధిస్తున్నాం. ఈ సమయంలో మోసపూరిత వాగ్దానాలకు లొంగి ఓటును వృథా చేసుకోవద్దు. కష్టాలు కొని తెచ్చుకోవద్దు. మా అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి బీఆర్ఎస్ చేసిన ప్రగతికే పట్టంగట్టి మరింత వృద్ధిని సాధించుకోవాలి' అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను కోరారు. కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రజాశీర్వాద సభల్లో ఆయన ప్రసంగించారు.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్ / గంగాధర/ జమ్మికుంట

2లో...





ప్రజాఆశీర్వాదసభల్లో సీఎం కేసీఆర్ వెంట చొప్పదండి, హుజూరాబాద్ అభ్యర్థులు సుంకె రవిశంకర్, పాడి కౌశిక్



కరీంనగర్ సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన మంత్రి గంగుల



మాట్లాడుతున్న తెలంగాణ పవర్ లూమ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్

పవర్లూమ్ కార్మికుల డిమాండ్లు మ్యానిఫెస్టోల్లో పెట్టాలి

- పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్

నవతెలంగాణ - సిరిసిల్ల

సీఐటీయూ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌లోని భవాని ఫంక్షన్ హాల్‌లో గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా పవర్ కార్మికుల విస్తృతస్థాయి సమావేశాన్ని పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ హాజరై మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో పవర్లూమ్ కార్మికుల డిమాండ్లను అన్ని పార్టీలు మ్యానిఫెస్టోలో పెట్టి ప్రకటించాలని డిమాండ్ చేశారు. పవర్లూమ్ కార్మికులకు నిరంతరం సంవత్సరం పాటు ఉపాధి కల్పించాలని, వర్కర్ టూ ఓనర్ పథకాన్ని వెంటనే పూర్తి చేసి కార్మికులకు అందుబాటులోకి తీసుకురావాలని, బతుకమ్మ చీరల 10శాతం

మిగతా 2 లో...

జగిత్యాలలో గెలిచిన వారంతా ఉద్దండులే.!

- నియోజకవర్గం నుంచి పలు శాఖల్లో మంత్రులుగా చేసిన నాయకులు
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న ఎల్.రమణ
- కాంగ్రెస్‌లో రాష్ట్రస్థాయి నేతగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- జగిత్యాల నుంచి పోటీలో 19 మంది అభ్యర్థులు
- ఈసారి ఉద్యమాల గడ్డపై జెండా పాతేది ఎవరో.?

వివరాలు 4 లో...

సిరిసిల్లలో మారుతున్న సమీకరణాలు..

- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. సిరిసిల్ల వేములవాడ నియోజకవర్గాల్లో టికెట్ల కేటాయింపు కొన్ని పార్టీల్లో అసంతృప్తి నెలకొంది. దీంతో పలువురు పార్టీలు మారుతున్నారు. మొదట్లో బీఆర్ఎస్ గులాబీ ఆకర్ష ఆపరేషన్ నిర్వహించింది. సిరిసిల్ల నియోజకవర్గంలో మాత్రం బిజెపి పుట్టి మునిగిందనే చెప్పుకోవచ్చు. నేతలు కార్యకర్తలు పార్టీలు మారుతున్నారు అనేకమంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. నేతల మెడలో ఉదయం ఓ రంగు కండువా ఉంటుండగా మధ్యాహ్నం మరో రంగు కండువా వేసుకుంటున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నేతలు పొద్దున రాజీనామాలు మధ్యాహ్నం మరో పార్టీలో చేరికలు కనిపిస్తున్నాయి.

నవతెలంగాణ - సిరిసిల్ల

పెద్ద తలకాయల మార్పుతో కంగు తింటున్న పార్టీలు

రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు ఇతర పార్టీల నేతలపై ప్రత్యేక దృష్టి సారించారు. పార్టీలో ప్రజల్లో ఎవరికి ఎంత బలం ఉందో గుర్తిస్తూ వారితో మాట్లాడుతూ బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్నాడు. ఇటీవల బీజేపీ నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవునూరి రమాకాంతరావు రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ అన్నల్దాస్ వేణు బీజేపీ మండల అధ్యక్షులు సురువు వెంకటి బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు భాస్కర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర విష్ణులతోపాటు అనేకమంది మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రధానంగా వరంగల్ జిల్లాకు చెందిన రాణి





రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరిన రైతుబంధు జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసయ్య

రుద్రమ రెడ్డికి సిరిసిల్ల బీజేపీ టికెట్ ఇవ్వడంతో అనేకమంది బీజేపీ నేతలు ఇతర పార్టీలోకి వచ్చేది రాణి రుద్రమా రెడ్డికి టికెట్ ఇవ్వడంతోనే మరో పార్టీలో చేరినట్లు ఆ నేతలు బహిరంగంగా ప్రకటించారు.

ప్రస్తుతం మాత్రం రాణి రుద్రమరెడ్డి బీజేపీ నేతలను ఒకే తాటిపైకి తీసుకువచ్చింది. అలాగే సిరిసిల్లలోని కొంతమంది న్యాయవాదులు మంత్రి కేటీఆర్‌ను కలిసి బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. బీజేపీలో పనిచేసిన వేములవాడ మండలంలోని ఎంపీపీ బండ మల్లేశం జిల్లా అధికార ప్రతినిధి గోపు బాలరాజు పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే కాంగ్రెస్ నేత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కొండ ప్రతాప్ బీఆర్ఎస్‌లో చేరారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నుంచి మాజీ కౌన్సిలర్ ఎల్లే లక్ష్మీనారాయణ వైద్య శివప్రసాద్ మ్యాన ప్రసాద్, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షులు గోలి వెంకటరమణ, ఇల్లంతకుంట ఎంపీపీ వెంకటరమణారెడ్డి, మాధవరెడ్డి గుడిసెల

మిగతా 2 లో...

మసీదులు తవ్వితే సిపాయా?

కరీంనగర్ సభలో సీఎం కేసీఆర్

మసీదులు, గుళ్ల కూలగొడుతాం. తవ్విచూస్తాం అనేటోళ్లు ఏమైనా సిపాయిలా?. మతపిచ్చిరేపి పబ్బంగడుపుకునేందుకు జనం మధ్య చిచ్చురేపుతారా? ఒకప్పుడు కర్ఫ్యూలు, కొట్లాటలున్న తెలంగాణలో రాష్ట్రం ఏర్పడి మా ప్రభుత్వం వచ్చాక ఒక్క కర్ఫ్యూ లేదు. ఒక్క కొట్లాట లేదు. ప్రశాంత జీవనాన్ని అందించగలిగాం. అటువంటిది ఇక్కడి ప్రజలు గోల్‌మాల్ అయి వినోద్‌ను కాదని బీజేపీ ఆయనను గెలిపించి ఐదేండ్లు బాధపడ్డారు. ఇప్పుడు ఆ తప్పు చేయవద్దు. విధ్వంసం సృష్టిస్తామనే వాళ్లకు కరీంనగర్ ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టాలి.' అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్ నియోజకవర్గ ప్రజాశీర్వాదసభలో ప్రసంగించారు. కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్ ఉన్నప్పుడే ఈ నగరాన్ని స్మార్ట్‌సిటీ జాబితాలో పెట్టించాడని, ఆయన ఉన్నప్పుడు కేంద్రం నుంచి నిధులూ తీసుకొచ్చారని చెప్పారు. మరోవైపుగంగుల కమలాకర్ విషయాన్ని ప్రస్తావిస్తూ ఇక్కడి ఎమ్మెల్యే మొండివాడని, కరీంనగర్ కావాల్సిన నిధులు, అభివృద్ధిపనుల కోసం పట్టుపట్టి సాధించుకున్నాడని తెలిపారు. ఇప్పుడు తీగల వంతెన పూర్తయిందని, రూ.410కోట్లతో మానేరు రివర్‌ఫ్రంట్ పనులు సాగుతున్నాయని, రాబోయే రోజుల్లో కరీంనగర్ ఒక అద్భుత పర్యాటక కేంద్రంగా మారుతుందని వివరించారు. కేబుల్‌బ్రిడ్జిపై డాంబర్ కారిందని, దాన్ని కూలగొట్టాలని అంటున్న నాయకులను ఏం చేయాలో ప్రజలే ఆలోచించాలన్నారు. ఏం చేయక ఇంట్ల పంటనే గొప్పొడని, పని చేసే వాళ్లపైనే రాళ్లు పడుతాయని, అలా గంగుల కమలాకర్‌పై ఎన్ని నిందారోపణలు చేసినా ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని కోరారు. పనిమంతుడు గంగుల కమలాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రగతికి పట్టం కట్టండి




సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి గంగుల, సీఎంకు గదను అందిస్తున్న మేయర్ సునిల్‌రావు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్ / గంగాధర/ జమ్మికుంట

'తెలంగాణ రాక ముందు అరిగోసపడ్డాం. తాగు, సాగునీళ్లలేక, కరెంటు రాక తిప్పలు పడ్డాం. రాష్ట్రం ఏర్పడ్డాక కఠోర శ్రమకోర్చి బలమైన పునాదులు వేసుకుని ఆ కష్టాలన్నీ దూరం చేసుకున్నాం. ప్రగతిపథంవైపు నడుస్తున్నాం. దేశంలోనే వరి పండించే రాష్ట్రాల్లో పంజాబ్‌ను దాటి నెంబర్‌వన్‌స్థానానికి ఎదిగాం. మిగతా ప్రగతిలోనూ ర్యాంకులు సాధిస్తున్నాం. ఈ సమయంలో మోసపూరిత వాగ్దానాలకు లొంగి ఓటును వృథా చేసుకోవద్దు. కష్టాలు కొని తెచ్చుకోవద్దు. మా అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి బీఆర్ఎస్ చేసిన ప్రగతికే పట్టంగట్టి మరింత వృద్ధిని సాధించుకోవాలి' అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను కోరారు. కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రజాశీర్వాద సభల్లో ఆయన ప్రసంగించారు. తెలంగాణ సాధన కోసం మొట్టమొదటిసారి సింహగర్జన చేపట్టిన గడ్డ కరీంనగర్ అని, అప్పటి నుంచి బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తూ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారని అన్నారు.

1969లో తెలంగాణ కోసం ఉద్యమించిన 400 మందిని పొట్టన పెట్టుకన్న చరిత్ర కాంగ్రెస్‌దంటూ విమర్శించారు. 2004లో ఆ పార్టీతో పొత్తుపెట్టుకున్నప్పుడు ఇక్కడ రాష్ట్రంలో, అక్కడ కేంద్రంలో అధికారంలో ఉన్నా.. తెలంగాణ ఇవ్వలేదని, మళ్లీ 14ఏండ్లు కొట్లాడాల్సి వచ్చిందని తెలిపారు. అటువంటి మోసపూరిత కాంగ్రెస్ చరిత్రను ఎవరూ మరువలేరన్నారు. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో', 'కేసీఆర్ శవయాత్రో.. తెలంగాణ జైత్రయాత్రో' అంటూ నినదిస్తూ సాగించిన ఉద్యమ ఫలితమే స్వరాష్ట్ర సాధనకల ప్రజల ఆశీర్వాదంతో సాకారమైందన్నారు. అటువంటి తెలంగాణను పదేండ్లపాటు కాపాడుకుంటూ ప్రగతిపథంలో తీసుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రతి పల్లె, మండలం, పట్టణం అన్నతేడా లేకుండా రోడ్లు, తాగునీరు, సాగునీరు, 24గంటల కరెంటు సహా ఎన్నో సంక్షేమ పథకాలతో తెలంగాణ ప్రజల మొఖం తెల్లపడిందని అన్నారు. ఇప్పుడొచ్చి 'మాకు అధికారం ఇవ్వాలి' అంటూ మోసపూరిత వాగ్దానాలతో వస్తున్న కాంగ్రెస్‌ను నమ్మవద్దని కోరారు. లేదంటే మంచినీళ్లకష్టాలు, సాగునీటి తండ్లాట, కరెంటు వెతలు, చేనేత కార్మికుల ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు మళ్లీ పునరావృతం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలాంటి దేశాల్లో అక్కడి ప్రజలు పరిణితో ఆలోచించి ఓట్లు వేస్తూ ప్రగతిలో దూసుకుపోతున్నారని, ఇక్కడ కూడా అటువంటి పరిణితే ప్రజలకు రావాలని కోరారు. కరీంనగర్ ఎండ్లఎదుటే కనిపిస్తున్న తీగల వంతెన, మానేరు రివర్‌ఫ్రంట్‌లతో రాబోయే రోజుల్లో అద్భుతపర్యాటక క్షేత్రం అవుతుందన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోనే ఉన్న కొండగట్టుకు ఇప్పటికే తాను పర్యటించానని, అవసరమైతే రూ.వెయ్యికోట్లతో అద్భుతదైవక్షేత్రంగా తీర్చిదిద్దబోతున్నామని అన్నారు. వదరకాలువలు సజీవజలధారలుగా మారయని, ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలతో లక్షలాది ఎకరాల్లో ఇక్కడ పంటలు పండుతున్నాయన్నారు.

బీజేపీకి మత పిచ్చి తప్ప ఏం లేదు

బీజేపీ పార్టీకి మత పిచ్చి తప్ప ఏమీ లేదని, ప్రజల దృష్టి ఎంతమాత్రమూ లేదన్నారు. అందులోనూ తెలంగాణకు రూపాయి పని చేసిన పాపాన పోలేదన్నారు. ప్రధాని మోడీ దేశంలో 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేస్తే.. మర్యాదకన్నా తెలంగాణకు ఒక్క కాలేజీ ఇవ్వలేదన్నారు. అయినా తమ ప్రభుత్వం జిల్లాకో మెడికల్‌కాలేజీ ఏర్పాటు చేసిందని, రాబోయే ఏడాది నుంచే సంవత్సరానికి పదివేల మంది డాక్టర్లు తయారవుతారని అన్నారు. కేంద్ర నిబంధనల ప్రకారం జిల్లాకో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. రాష్ట్రంలో కొత్త జిల్లాలకు ఇవ్వడం లేదన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం 1080 రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసిందని, అందులోని పిల్లలు అద్భుత ఫలితాలు సాధించడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో అగ్రకులాల పేదలకూ రాష్ట్రంలో 119 రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని రకాల ప్రజలను కడుపులో పెట్టుకుని, కులం, మతం అనే తేడా లేకుండా ప్రగతిశీల, క్రియాశీల పద్ధతిలో పని చేస్తూ పదేండ్లలో ఊహించనిప్రగతిని సాధించామన్నారు. మరోవైపు ఆయా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల పలు ప్రతిపాదనకు రాబోయే ప్రభుత్వంలో తీర్చుతామని హామీ ఇచ్చారు. ఆయా సభల్లో రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, మధుసూదనాచారి, ఎమ్మెల్యే అభ్యర్థులు గంగల కమలాకర్, సుంకెరవిశంకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సిరిసిల్లలో మారుతున్న సమీకరణాలు..

▸ మొదటిపేజీ తరువాయి...

యాదవ్ కట్ల కనకమ్మ బత్తిని సంపత్, విన్నపల్లి టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మల్లేషం, వేములవాడ నియోజకవర్గంలోని చందుర్తి సింగిల్విండో చైర్మన్ పుల్కం మోహన్, రుద్రంగి బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయ చైర్మన్ అల్లూరి రాజిరెడ్డితో పాటు అనేకమంది నేతలు కార్యకర్తలు చేరారు. ఇటీవల కొలనూరు మాజీ సర్పంచ్ రషీద్ కాంగ్రెస్‌లో చేరారు. అలాగే బీఆర్ఎస్‌లో బీజేపీ నేత తుల ఉమా చేరడంతో వేములవాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు కొంత బలం చేకూరినట్లయింది. బీఆర్ఎస్‌కు చెందిన రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు గడ్డం నరసయ్య రెండు రోజుల కిందట కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ శ్రేణులు కంగుతిన్నారు. అలాగే మాజీ ఎంపీపీ మందాడి జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సామల పావని అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రవి, నాయకులు కోడం శ్రీనివాస్, కోడం సంజీవ్, కూరపాటి శ్రీశైలంతోపాటు చీర్లవంచ, లక్ష్మీపూర్, గోపాల్‌రావు పల్లె, బస్వాపూర్, తాడూరు, చింతల్ తానా గ్రామాల్లోని బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరారు.

అసంతృప్తులకు కేటీఆర్ ఫోన్

అధికార టీఆర్ఎస్ పార్టీలో అనేకమంది అసంతృప్తులను బుజ్జగించే పనిలో మంత్రి కేటీఆర్ ఉన్నారు. అసంతృప్తులతో మంత్రి కేటీఆర్ ఫోన్ చేసి మాట్లాడుతున్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని కోరుతూ అసంతృప్తిగా ఉన్న వారిని పిల్చుకొని ఆయన మాట్లాడుతున్నారు. బీజేపీలో అసంతృప్తులు ఇతర పార్టీలోకి వెళ్తున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా ఉన్న లగిశెట్టి శ్రీనివాస్ తనకు టికెట్ రాకపోవడంతో విద్యార్థి రాజకీయ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. సిరిసిల్ల పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన పత్తిపాక సురేష్ సిరిసిల్ల శాసనసభకు పోటీ చేయడానికి యువతను ఆకర్షించుకుంటున్నారు. బహుజన వాదంతో బీఎస్పీ నుంచి పోటీ చేయడానికి ముందుకు వచ్చిన న్యాయవాది పిట్టల భూమేష్ నియోజకవర్గంలోని ప్రచారం చేస్తూ ముందుకు వెళు తున్నాడు. ఇలా అభ్యర్థులు పోటీ చేస్తూ ప్రచారంలో ముందుకు వెళ్తే పట్టణంలో ఓట్లు చిలే అవకాశం కనిపిస్తున్నది.

పవర్లూమ్ కార్మికుల డిమాండ్లు మ్యానిఫెస్టోల్లో పెట్టాలి

▸ మొదటిపేజీ తరువాయి...

యారన్ సబ్సిడీని కాలయాపన చేయకుండా ఏ సంవత్సరం ఆ సంవత్సరమే అందించాలని, టెక్స్‌టైల్ పార్కులో మూతపడ్డ పరిశ్రమలను తెరిపించాలని, పూర్తిస్థాయిలో పరిశ్రమలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకొని కార్మికులకు ఉపాధి కల్పించాలని, వలస కార్మికులకు కాకుండా స్థానిక కార్మికులకే మొదట ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్లను తీర్మానాలుగా ప్రవేశపెట్టి కార్మికులందరి అభిప్రాయంతో ఆమోదింపచేసుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మూషం రమేష్, మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, కూచన శంకర్, నక్క దేవదాస్, గోవిందు లక్ష్మణ్, సబ్బని చంద్రకాంత్, మోర తిరుపతి, సందుపట్ల పోచమల్లు, శ్రీనివాస్, సదానందం రమేష్, వేణు పెద్ద ఎత్తున పవర్లూమ్ కార్మికులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ చేపట్టాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి





నవతెలంగాణ - సిరిసిల్ల

పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌ను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చేపట్టాలనీ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు.శుక్రవారం సాయంత్రం పోస్టల్ బ్యాలెట్ , హెూం ఓటింగ్‌పై కలెక్టరేట్‌లో అధికారులకు ఓరియంటేషన్ ట్రైనింగ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌పై అధికారులకు సూచనలు చేశారు. 80ఏళ్ల పైబడిన వృద్ధులు, 40శాతంపైన వైకల్యం ఉండి హోం ఓటింగ్ కోసం వచ్చిన దరఖాస్తున్న అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల సంఘం హోం ఓటింగ్ సదుపాయాన్ని కల్పించిందన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్దేశిత బృందాలు హోమ్ ఓటింగ్ కోసం బృందాలు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి నిబంధన ల మేరకు ఓటు హక్కు కు అవకాశం కల్పిస్తాయని చెప్పారు. పోలింగ్ సిబ్బందికి కేటాయించిన అధికారిక వాహనంలో వాహనంలో మాత్రమే సిబ్బంది వెళ్లి హోం ఓటింగ్ విధులు నిర్వర్తించాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఈ నెల 21 నుండి 25 వరకు హోం ఓటింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బందికి ఈ నెల 21,22,25 తేదీలలో ట్రైనింగ్ జరిగే వేదికల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సర్వీస్‌ల సిబ్బందికి ఈ నెల 25వ తేదీన రిటర్నింగ్ అధికారి కార్యాలయాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌ను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిష్పక్షపాతంగా పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా కేటాయించిన అధికారులు పనిచేయాలన్నారు.అంతకుముందు మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌పై పిఓలు, ఓపిఓలు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇచ్చారు.సమావేశంలో పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి పి.లక్ష్మీరాజం, సిపిఓ పిబి శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించండి

నవతెలంగాణ - ఇల్లంతకుంట

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లంతకుంట మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇల్లంతకుంట ఎస్ఐ డి.సుధాకర్ కోరారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, రెండు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాల్లో ఇల్లంతకుంట ఎస్సై డి సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి వల్లంపట్ల గ్రామంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లంతకుంట ఎస్సై డి. సుధాకర్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 29 పోలింగ్ ప్రదేశాల్లో 58 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ప్రతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గ్రామాలలో కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించడమే కాకుండా ప్రజలకు ఎన్నికల పట్ల అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంగించి నట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, కానిస్టేబుల్ మధు, శ్రీకాంత్, జీవన్, లక్ష్మీనారాయణ, హెూంగార్డు క్రాంతి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు .

విద్యార్థినులకు సానిటరీ ప్యాడ్స్ పంపిణీ



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎస్బీఐ బ్రాంచ్ సౌజన్యంతో సోషల్ రెస్పాన్సిబులిటీ కార్యక్రమంలో భాగంగా కేర్ ఓ సేవ్ కంపెనీ ఆధ్వర్యంలో బాలికలకు సానిటరీ నాప్కిన్స్ ప్యాడ్స్‌ను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కేర్ ఓ సేవ్ సేల్స్ ఎగ్జిక్యూట్ శ్రావణి బాలికలకు నాప్కిన్స్ ప్యాడ్స్ ఉపయోగించే విధానం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూస రఘుపతి, ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ రాములు, ఫీల్డ్ ఆఫీసర్ ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు పొలాస మల్లేశం, ఉమాదేవి, రమాదేవి, మాధురి, శ్రీదేవి, రాములు, బాబు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఉప సర్పంచ్



నవతెలంగాణ- వేములవాడ : వేములవాడ అర్బన్ మండలంలోని చంద్రగిరి గ్రామ ఉప సర్పంచ్ పెండ్యాల అశోక్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు అశోక్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఆయనతో పాటు పార్టీలో చేరిన దాదాపు 100మంది గ్రామస్తులను చల్మెడ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన నాయకులకు సరైన గుర్తింపు ఉంటుందన్నారు. అశోక్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో బి.ఆర్.ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రవి చందర్ రావు, సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, గ్రామ సర్పంచ్ రాసురి రాజేశం, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భాస్కర్, ఉప సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు సందనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తెలంగాణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్

నవతెలంగాణ - కోనరావుపేట

ప్రజా తెలంగాణ కాంగ్రెస్‌తోనే సాధ్యం వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీమ్ లతో సామాన్య ప్రజల అభివృద్ధి జరుగుతుందన్నారు.బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదని, కాంగ్రెస్ హయంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నీరటి విష్ణుప్రసాద్



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న నీరటి విష్ణు ప్రసాద్ రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు బరిగెల నారాయణ ఆదేశాల మేరకు రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ గొంటి రవి శుక్రవారం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనపట్ల విశ్వాసంతో తనను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గొంటి రవికి తన మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారు

సిరిసిల్ల అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : బీఆర్ఎస్ పాలనపై విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం చింతల్ తాన, తాడూరు గ్రామాలకు చెందిన పలువురు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేకే మహేందర్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, మని కుమార్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ - గంభీరావుపేట : మండలంలోని మల్లారెడ్డి పేట గ్రామంలో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు కొండూరి గాంధీ సిరిసిల్ల నియోజకవర్గ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ, మహేందర్ రెడ్డిలు మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల నుంచి అమలు కానీ హామీలు చెప్పి ప్రజలను మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే సరైన సమయం ఆసన్నమైందన్నారు.

గడపగడపకూ ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కళ



నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : బీఆర్ఎస్ అభ్యర్థి కేటీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పురపాలక సంఘ అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణిఅన్నారు. 2023 శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మంత్రి కల్వకుంట్ల తారక రామారావును గెలిపించాలని గడపగడపకు బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. సిరిసిల్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ ఎన్నికల ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో మెరుగు శేఖర్, శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం ధర్మకర్త దూస ఈశ్వరి, విశ్వనాథ స్వామి దేవాలయం ధర్మకర్త గోషిక శ్రీనివాస్, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలిపించండి అభివృద్ధి చేస్తా

నవతెలంగాణ - రుద్రంగి : బాల్కొండ ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలో భాగమైన ఉమ్మడి మానాల గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. రుద్రంగి మండలంలోని ఉమ్మడి మానాలలో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుం జలపతి,నాయకులు జక్కు మోహన్, మాజీ ఎంపీటీసీ రాజు నాయక్, గుగులోత్ రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమను కాపాడుకోవాలి

లాల్ బావుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పంతం రవి



నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

పవర్లూమ్ కార్మికుల బాధలు వద్దు యజమానులతో ముచ్చటేమొద్దు అని లాల్ బావుట చేనేత పవర్ లూమ్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. శుక్రవారం సుభాష్ నగర్‌లోని కార్మిక భవనంలో లాల్ బహుట చేనేత పవర్ లూమ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యమంలో పాల్గొని మాట్లాడారు. సిరిసిల్లలోని పవర్లూమ్ పరిశ్రమ సమగ్ర అభివృద్ధి కోసం ఆరు గ్యారెంటీలను ప్రకటించిన కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డికి చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పవర్ లూమ్ వస్త్ర పరిశ్రమను కాపాడుకోవాలని ఆసాములకు కార్మికులకు విజ్ఞప్తి చేస్తూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సమావేశంలో లాల్ బహుట చేనేత పవర్ లూమ్ కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జగిత్యాల
శనివారం 18 నవంబర్ 2023 www.navatelangana.com

జగిత్యాలలో గెలిచిన వారంతా ఉద్దండులే.!

- నియోజకవర్గం నుంచి పలు శాఖల్లో మంత్రులుగా చేసిన నాయకులు
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న ఎల్.రమణ
- కాంగ్రెస్‌లో రాష్ట్రస్థాయి నేతగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- జగిత్యాల నుంచి పోటీలో 19 మంది అభ్యర్థులు
- ఇసారి ఉద్యమాల గడ్డపై జెండా పాతేది ఎవరో.?

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందిన జగిత్యాల నియోజకవర్గం 1952లో ఏర్పాటైంది. ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరగ్గా 10 సార్లు కాంగ్రెస్ గెలుపొందగా, నాలుగుసార్లు టీడీపీ విజయం సాధించింది. స్వతంత్రులు, ఎన్‌సీఎఫ్, టీఆర్ఎస్(బీఆర్ఎస్) ఒక్కోసారి గెలుపొందాయి. గతంలో జగిత్యాల, మల్యాల, కొడిమ్యాల మండలాలు జగిత్యాల నియోజకవర్గంలో ఉండగా పునర్విభజనలో భాగంగా 1999లో మల్యాల, కొడిమ్యాల మండలాలను చొప్పదండి నియోజకవర్గంలో కలిపి, బుగ్గారం నియోజకవర్గంలోని రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలను జగిత్యాలలో కలిపారు. ప్రస్తుతం జగిత్యాల పట్టణంతో పాటు అర్బన్, రూరల్ మండలాలు, సారంగాపూర్, బీర్‌పూర్, రాయికల్ మండలాల్లో కలిసి నియోజకవర్గంలో 2,26,635 మంది సాధారణ ఓటర్లు ఉన్నారు. పురుషులు 109300, మహిళ లు 117315, ఇతరులు 20 మంది ఓటర్లు ఉన్నారు.

ఎన్నికలలో పదిసార్లు గెలిచిన కాంగ్రెస్..

జగిత్యాల నియోజకవర్గానికి ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరగ్గా 1952లో జరిగిన ద్విసభకు ఎన్‌సీఎఫ్, పీడీఎఫ్ అభ్యర్థులు గెలుపొందగా ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో 10 సార్లు కాంగ్రెస్, నాలుగుసార్లు టీడీపీ విజయం సాధించింది. ఒకసారి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. గత ఎన్నికల్లో తొలిసారి టీఆర్ఎస్ గెలిచింది. 1952లో ఇక్కడ గెలిచిన బుట్టి రాజారాం 1957లో సుల్తానాబాద్, 1962లో పెద్దపల్లి, 1967లో నుస్తులాపూర్‌లో గెలుపొందారు. 1972లో గెలుపొందిన వి.జగపతిరావు 1989లో కరీంనగర్‌లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. 1962లో ఎం.ధర్మారావు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందగా 1967లో కాసుగంటి లక్ష్మీనర్సింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1994లో గెలుపొందిన ఎల్.రమణ 1996లో లోక్‌సభకు ఎన్నిక కాగా ప్రస్తుతం శాసనమండలి సభ్యుడిగా ఉన్నారు. 1957లో మెట్‌పల్లికి చెందిన హన్మంతరావు గెలుపొందగా, 1978లో మల్లాపూర్ మండలానికి చెందిన సురేందర్‌రావు విజయం సాధించారు. నియోజకవర్గం నుంచి గెలుపొందిన వారిలో జీవన్‌రెడ్డి, రాజేశంగౌడ్, ఎల్.రమణ మంత్రులుగా పనిచేశారు. జగిత్యాల నియోజకవర్గానికి 1962లో స్వతంత్ర ఎమ్మెల్యేగా ధర్మారావు గెలుపొందిన సమయంలో గుత్తేదారుగా ఉండటంతో అనర్హత వేటు పడగా 1963లో ఉప ఎన్నిక జరిగింది. 1994లో గెలుపొందిన ఎల్.రమణ లోక్‌సభకు ఎన్నిక కావటంతో 1996లో ఉప ఎన్నిక జరిగింది.



మంత్రులుగా పని చేసిన ఇక్కడి నాయకులు..

జగిత్యాల నియోజకవర్గం నుంచి గెలిచిన వారిలో ఇప్పటి వరకు ముగ్గురు రాష్ట్ర మంత్రులుగా పని చేశారు. ముగ్గురూ ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే రాష్ట్ర మంత్రులుగా పని చేయటం విశేషం. 1983లో టి. జీవన్‌రెడ్డి టీడీపీ నుంచి గెలిచి రాష్ట్ర ఆబ్కారీశాఖ మంత్రిగా పని చేయగా, 1985లో అదే పార్టీ నుంచి గెలిచిన జి. రాజేశంగౌడ్ రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రిగా, అలాగే 1994లో ఎల్. రమణ రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రులుగా పని చేశారు. వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు టి. జీవన్ రెడ్డి మరోసారి రాష్ట్ర ఆర్ అండ్ బి మంత్రిగా పనిచేశారు.

సీనియర్‌పై పోటీకి జూనియర్లు..

జీవన్‌రెడ్డి మరో మారు కాంగ్రెస్ తరపున పోటీలో ఉన్నారు. ఆరుసార్లు జగిత్యాల నుంచి విజయం సాధించిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి 2018 ఎన్నికలలో ఓటమి చెందారు. టీఆర్ఎస్ తరపున పోటీచేసిన డాక్టర్ సంజయ్ విజయం సాధించారు. ప్రస్తుతం జగిత్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా టి.జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి డాక్టర్ సంజయ్‌కుమార్ బరిలో నిలువగా, బీజేపీ నుంచి డాక్టర్ భోగ శ్రావణిని బరిలో ఉన్నారు. పదో సారీ మరిలో ఉన్న సీరియన్ నాయకులు జీవన్‌రెడ్డిని మరోసారి ఓడించేందుకు జూనియర్లు శ్రమిస్తున్నారు.

సంవత్సరం	గెలుపొందిన వారు	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1952 (ద్వి)	బి. మల్లారెడ్డి	పీడీఎఫ్	కె. దేవరాజము	స్వాతంత్ర్య
1952 (ద్వి)	బి. రాజము	ఎన్‌సీఎఫ్	డి. రాజయ్య	కాంగ్రెస్
1957	డి. హన్మంతరావు	కాంగ్రెస్	ఎస్. ఆర్. లింగాల	పిఎస్‌పి
1962	ఎం. ధర్మారావు	స్వతంత్ర	డి. హన్మంతరావు	కాంగ్రెస్
1963 (ఉప)	కె. లక్ష్మీనర్సింహారావు	కాంగ్రెస్	ఎస్. రెడ్డి	స్వతంత్ర
1967 (ఉప)	కె. లక్ష్మీనర్సింహారావు	కాంగ్రెస్	ఏకగ్రీవం	
1972	వి. జగపతిరావు	కాంగ్రెస్	ఎస్ఆర్‌రావు	స్వతంత్ర
1978	డి. సురేందర్ రావు	కాంగ్రెస్	జె. దామోదర్‌రావు	జనతా
1983	టి జీవన్ రెడ్డి	తెదేపా	జె. ఆర్ రావు	కాంగ్రెస్
1985	జి. రాజేశంగౌడ్	తెదేపా	టి జీవన్ రెడ్డి	కాంగ్రెస్
1989	టి జీవన్ రెడ్డి	కాంగ్రెస్	జి. రాజేశంగౌడ్	టీడీపీ
1994	ఎల్. రమణ	టీడీపీ	టి.జీవన్ రెడ్డి	కాంగ్రెస్
1996(ఉప)	టి.జీవన్ రెడ్డి	కాంగ్రెస్	బి వేణుగోపాల్	టీడీపీ
1999	టి.జీవన్ రెడ్డి	కాంగ్రెస్	ఎల్. రమణ	టీడీపీ
2004	టి.జీవన్ రెడ్డి	కాంగ్రెస్	ఎల్. రమణ	టీడీపీ
2009	ఎల్. రమణ	టీడీపీ	టి.జీవన్ రెడ్డి	కాంగ్రెస్
2014	టి.జీవన్ రెడ్డి	కాంగ్రెస్	ఎం. సంజయకుమార్	టీఆర్ఎస్
2019	ఎం. సంజయకుమార్	టీఆర్ఎస్	టి.జీవన్ రెడ్డి	కాంగ్రెస్

ప్రభుత్వాస్పత్రుల రూపు రేఖలు మార్చినం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్

నవతెలంగాణ-రాయికల్/ సారంగాపూర్

ప్రభుత్వాస్పత్రుల రూపు రేఖలు మార్చామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని వివిధ కుల సంఘాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాయికల్, జగిత్యాల ప్రభుత్వాస్పత్రి రూపురేఖలు మార్చినామని, జగిత్యాల పాత బస్టాండ్‌లో ఉన్న ఆసుపత్రిలో అదనంగా 100 పడకలకు పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా 650 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని తీసుకోచ్చామని, దీని ద్వారా జిల్లా వాసులకే కాకుండా పొరుగు జిల్లాల వారికి సైతం వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు.మరో సారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.మండలంలోని బీజేవైఎం ప్రధాన కార్యదర్శి గాజంగి అశోక్, కుర్మపల్లి, రామాజీపేట్ గ్రామాలకు చెందిన 200 మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్

సారంగాపూర్ మండలంలోని నాగునూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, దామెర శేఖర్ రెడ్డితోపాటు 20 మంది యువకులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. లచ్చక్క పేట గ్రామం నుంచి మరో 20 మంది యువకులు బిఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దావ సురేష్, ఫాక్స్ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


పార్టీకి ఆహ్వానిస్తున్న సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-కథలాపూర్

మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని కథలాపూర్, సిరికొండ, తక్కళ్లపల్లి, చింతకుంట, తండ్రియాల్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్ఐ కిరణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-రాయికల్

మండలంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సమన్వయ సమావేశాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా అంబుడ్స్ మెన్ కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో రూ.6 కోట్ల 62 లక్షల నిధులతో చేపట్టిన ఉపాధి హామీ పనుల నిర్వహణ, కూలీలకు వేతనాలు వంటి అంశాలపై ఈ నెల 18 నుంచి 24 వరకు సామాజిక తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, ఏపీవో దివ్య ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-రాయికల్


పరిశీలిస్తున్న జిల్లా అధికారి

మండలంలోని చెర్ల కొండాపూర్, ఇటిక్యాల, రామారావుపల్లె, జగన్నాథ్‌పూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల పరిశీలకులు హెచ్. బసవరాజు సందర్శించారు. ఓటర్లకు కావాల్సిన వసతి, సౌకర్యాలను కల్పించాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఎలాంటి ప్రచార గోడ రాతలు లేకుండా చూడాలని, ఓటింగ్ శాతం పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని బిఎల్ఓలకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, డీటీ వఖీల్, ఆర్ఐ ఈ కాంతయ్య, పద్మయ్య పాల్గొన్నారు.

కోడ్ అమలులో పక్షపాతమా.!

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి ఎన్నికల నిబంధనల ప్రకారం ముసుగు వేసినా.. అధికారులు శిలాఫలకాన్ని వదిలేశారు. ఎలక్షన్ కోడ్ విగ్రహాలకు మాత్రమే శిలా ఫలకాలకు కాదని అధికారుల ఉద్దేశ్యమా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నవతెలంగాణ 5
పెద్దపల్లి
శనివారం నవంబర్ 18, 2023 www.navatelangana.com

రామగుండం నాకు దేవాలయం, ప్రజలే నాకు దేవుళ్లు

▸ రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నాకు దేవాలయం, ప్రజలే నాకు దేవుళ్లని రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ అన్నారు. రామగుండం కార్పొరేషన్ 47,50వ డివిజన్లలో లక్ష్మీనగర్, అడ్డగుంటపల్లి, గణేష్ నగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అందే రాజకుమార్, బూడిద సత్యం, మేడి రాజు, అల్లం రాంమోహన్, శంకర్నాథ్, శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమారపు సత్యనారాయణ మాట్లాడుతూ లక్ష్మీనగర్‌లోని వ్యాపారులు ఒకసారి ఆలోచించాలని, తాను అధికారంలోకి రాకముందు ఎలా ఉండేది, తాను అధికారంలోకి వచ్చాక ఇక్కడ ఉన్న రోడ్లు విస్తరించి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేశానని, మీ వ్యాపారం బాగా జరుగుతుంది అంటే అది కేవలం నేను చేసిన అభివృద్ధి వల్లనే అని అన్నారు. అదేవిధంగా ఇక్కడ మెడికల్ కాలేజీ నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే నా హయాంలోనే, మంజూరు చేపించానని,కొందరు మేమే తెప్పించామని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా గోదావరి నదిని కలుషితం చేశారని, మురుగునీరు వస్తుందని మళ్లీ నేను గెలిచాక గంగమ్మ తల్లిని శుద్ధి చేపించి స్వచ్ఛమైన మంచి నీరు 24 గంటలు అందిస్తానని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గురించి మీకు తెలుసునని, ఏ పనిచేసినా కమిషన్లు తీసుకొని డబ్బులు సంపాదించడం తప్ప, ప్రజల గురించి అతనికి అవసరం లేదన్నారు. ఇప్పుడు కొత్తగా నాకు ఒక అవకాశం ఇవ్వండి అంటూ కాంగ్రెస్ అభ్యర్థి వస్తున్నాడని, ఎలక్షన్స్ కాకముందే వారి అనుచరుల ఆగడాలు మితిమీరి పోతున్నాయన్నారు. అందరూ వజ్రం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సోమారపు అరుణ్ లావణ్య, మాజీ మేయర్ రాజమణి, కుసుమ, మాజీ కార్పొరేటర్లు పిడుగు కృష్ణ, కోడాటి ప్రవీణ్, వడ్లూరి రవి, రవినాయక్, కిషన్ రావు, వీరన్న, పత్తి సంజీవ్, సుభాష్, నారాయణరెడ్డి, బిక్షపతి, దీటి వెంకటస్వామి, కిషన్‌రావు, చంద్రశేఖర్‌గౌడ్, సంపంగి శ్రీనివాస్, కమల్ గౌడ్, రాజుడేవిడ్, వీరేశం, సునీల్,రాజు తదితరులున్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న సోమారపు సత్యనారాయణ

విద్యా ప్రమాణాలు పాటించాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవ తెలంగాణ- పెద్దపల్లి
విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో పటిష్టమైన విద్యా ప్రమాణాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.శుక్రవారం పెద్దపల్లి మండలంలోని బంధంపల్లిలో పర్యటించిన జిల్లా కలెక్టర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ముందుగా బందంపల్లి పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, అక్కడ ప్రతిపాదించిన కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్ మరమ్మతు పనులు, టాయిలెట్ నిర్మాణ పనులు, రన్నింగ్ వాటర్ పనులు పూర్తి కావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఫ్లోరింగ్ మరమ్మతు పనులు చేపట్టి త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలని సూచించారు.

ప్రచార రథం అందించిన శ్రీధర్ బాబు అభిమాని

నవతెలంగాణ-ముత్తారం:
మంథని నియోజకవర్గ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గెలుపు కొరకు తమవంతు సాయంగా ఆయన అభిమాని, పెద్దపల్లి నియోజకవర్గం కాల్వశ్రీరాంపూర్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుల మనోహర్ రావు, విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచార రథాన్ని అందించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు సురేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, ముత్తారం మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జెండా ఊపి రథాన్ని ప్రారంభించారు.


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నాగుల చవితి వేడుకలు

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీ పరిధిలోని రెండో వార్డులో గల నాగులమ్మ దేవాలయం వద్ద నాగుల చవితి వేడుకలు పురస్కరించుకొని భక్తులు ఆలయానికి చేరుకొని నాగులమ్మ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆలయం పక్కనే ఉన్న పుట్టలో పాలు, కోడిగుడ్లు, పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పూజలు చేస్తున్న భక్తులు

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న అసంఘటిత రంగంలో పని చేస్తున్న హమాలీ, ఆర్టీసీ, ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్, బసంత్ నగర్, రైస్‌మిల్, గ్రానైట్, భవన నిర్మాణ, పెట్రోల్ బంకులు, ఏజెన్సీలు, టూవీ లర్, ఫోర్ వీలర్ షోరూంలు, సెక్యూరిటీతో పాటు తదితర రంగాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ.గౌస్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు శనగల శ్రీనివాస్‌లు అన్నారు. శుక్రవారం కరీంనగర్ డిప్యూటీ లేబర్ కమిషనర్ సామోజ్ జాన్సన్ రాజ్ ను కలిసి కార్మికుల సమస్యలపై మాట్లాడడం జరిగిందని వారు తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల కార్మికులలో మిగతా 8 లక్షల మంది కార్మికులకు సంక్షేమ పథకాల గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, పెళ్లి, కాన్పులకు ఇస్తున్న 30 వేల రూపాయల కానుకను లక్ష రూపాయలకు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

అక్రమ నిర్మాణం తొలగింపు

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని 39,40 డివిజన్‌లలో అక్రమ నిర్మాణాలను పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది శుక్రవారం తొలగించారు. 39వ డివిజన్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన గోడను కూల్చివేయగా 40వ డివిజన్‌లో అనుమతి లేకుండా అనధికారికంగా నిర్మించిన షెడ్డును తొలగించారు.


గోడను కూల్చివేస్తున్న జేసీబీ

సింగరేణి పరిరక్షణ కోసం కేసీఆర్ కృషి

రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి కార్మికుల సమస్యలను, డిమాండ్లను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ పరిష్కారం చేస్తూ.. సింగరేణి పరిరక్షణ కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం ఆర్జీ-1 పరిధిలోని ఓసీపీ-5 గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో సింగరేణి కార్మికులకు సంక్షేమం చేకూరుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ గొప్ప ఆలోచనలను దేశ ప్రజలు అభినందిస్తున్నారని అన్నారు. సింగరేణిలో రాబోయే కాలంలో ప్రైవేటు మిషన్లను అడ్డుకొని. కార్మికుల ఉనికిని కాపాడుతామన్నారు. కాంగ్రెస్, బీజేపీల ప్రచారాలను నమ్మవద్దని పిలుపు నిచ్చారు. రాబోయే ఎన్నికల్లో మళ్ళీ బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచి, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో టీబీజీ కేఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బి.వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ఆర్జీ-1 వైస్ ప్రెసిడెంట్ గంగ్ర దామోదర్ రావు, నగర మేయర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్లు బాల రాజ్‌కుమార్, పులేందర్, తదితరులున్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న చందర్

48వ డివిజన్‌లో బీఆర్ఎస్ నేతల ప్రచారం

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్‌ను గెలిపించాలని కోరుతూ 48వ డివిజన్‌లోని జమా మసీద్ వద్ద విస్తృతంగాప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పొన్నం విద్య లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారానికి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాల్గొని ముస్లింలను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ ఘుణ్ముకుల మహాలక్ష్మి తిరుపతి, కో ఆప్షన్ మెంబర్ రఫీక్ బాయ్, తానిపర్తి విజయలక్ష్మి గోపాల్ రావులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సకాలంలో వైద్యులు విధులకు హాజరు కావాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ -పెద్దపల్లి
వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చే పేషెంట్లతో, వారి సహాయ కులతో ఆసుపత్రి లోని వైద్యులు, సిబ్బంది సానుకూలంగా స్పందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లిలోని మాతా, శిశు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న వివిధ బ్లాక్‌లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, పేషెంట్లతో అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రికి వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని, ఉదయం 9 గంటల వరకు ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభం కావాలని, ఆసుపత్రి సిబ్బందికి బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, డాక్టర్ శౌరయ్య సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

మసీదుల వద్ద టీఎల్పీ అభ్యర్థి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న టీఎల్పీ అభ్యర్థి

నవతెలంగాణ-గోదావరిఖని:
తెలంగాణ లేబర్ పార్టీ అభ్యర్థి గొర్రె రమేష్ టెలివిజన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మసీదుల వద్ద ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ నగర్ చౌరస్తాలోని మసీదు, పాత మున్సిపల్ ఆఫీస్ దగ్గర గల మసీదులోని ముస్లింలను కలిసి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకొని అణిచివేసిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముస్లింలకు మాయ మాటలు చెప్పి మతం సెంటిమెంట్‌తో మనోభావాలను వాడుకొని అన్యాయం చేసిందని అన్నారు. కార్యక్రమంలో ఇరికిల్ల రాములు, దర్శనాల రాజయ్య, నాయిని గట్టయ్య, పాత మోహన్, గొర్రె అఖిల్ వర్మ, రాజేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాజ కొమురయ్య, మల్లయ్య యాదవ్, కంది శ్రీకాంత్ తదితరులున్నారు.

సజావుగా పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

▸ రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ ▸ సెక్టర్ అధికారులకు, బీఎల్‌వో సూపర్వైజర్లకు, బీఎల్‌వోలకు సూచనలు చేసిన అరుణశ్రీ


ఓటర్ స్లిప్పు అందుకుంటున్న ఆర్‌వో అరుణశ్రీ

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నియోజకవర్గ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ అన్నారు. శుక్రవారం, ఐడీసీటీఎన్ ఎన్టీపీసీ ఆడిటోరియం హాల్‌లో రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, ఏఆర్‌వోలు కలిసి సంబంధిత అధికారులతో ఎన్నికల నిర్వహణపై సెక్టర్ అధికారులకు, బీఎల్‌వో సూపర్వైజర్లకు, బీఎల్‌వోలకు సమావేశం నిర్వహించారు. అరుణశ్రీ మాట్లాడుతూ రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 263 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రాలలోన్ని సదుపాయాల ఏర్పాటు సెక్టార్ అధికారులే బాధ్యత అన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రణాళిక

రామగుండం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదు అయిందని, ఈసారి పోలింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్కరు ప్రధానపాత్ర పోషించాలన్నారు. ఈ సందర్భంగా మొదటి ఓటర్ స్లిప్పును రిటర్నింగ్ అధికారి అరుణశ్రీకి సంబంధిత బీఎల్‌వో అందజేసి రిజిస్టర్ సంతకం, వివరాలు నమోదు చేసుకున్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ సమయంలో సంబంధిత ఓటరుకు మాత్రమే తన స్లిప్పు అందజేయాలని, అతను అందుబాటులో లేనియెడల వారి కుటుంబ సభ్యులకు మాత్రమే ఓటరు స్లిప్పులు అందజేసి, రిజిస్టర్ వివరాలు నమోదు చేసుకుని వారి సంతకం తీసుకోవాల్సిందిగా తెలిపారు.

ఇంటి నుంచి ఓటు వేసే విధానం 12డి

భారత ఎన్నికల కమీషన్ 80 ఏళ్లపై పడ్డ వృద్ధులకు దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం(12డి) ని కల్పించిందని, రిటర్నింగ్ అధికారికి సదరు ఓటర్ల ఇంటి నుంచి ఓటు హక్కు స్వీకరించేవిధానాన్ని సంబంధిత బృందాలు వీడియోగ్రాఫీతో కలిపి పంపుతారని, రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం హాజరు కావచ్చు అని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం రిటర్నింగ్ అధికారి జే.అరుణశ్రీ, ఏఆర్‌వోలు కుమారస్వామి, జ్యోతి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, ఎంఈవో, ఎంపీడీవోలు, పీడీ అర్బన్ మెప్మా మీడియా నోడల్ అధికారి రజిని, స్వీప్ నోడల్ అధికారి స్వరూప రాణి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ విజయ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే బతుకులు ఆగం

రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:
కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మితే మన బతుకులు ఆగమవుతాయని, దొంగ మొక్కులు మెక్కుతూ దొంగ మాటలు చెబుతున్న కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మవద్దని, మనకు మంచి చేసిన కేసీఆర్‌కి అండగా ఉండాలని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం అంతర్గాం మండలం లింగపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జీ నారదాసు లక్ష్మణ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్య మంత్రి కేసీఆర్ నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలను రూపొం దించి అమలు చేస్తూ.. పేదల పాలిట దేవుడిగా నిలిచారని ఆయన అన్నారు. గ్రామ మాజీ ఉప సర్పంచ్ సింపతి బాజ్జీ, 9 వడివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



కోటగిరి మధుసూదన్ రావు, బీఆర్ఎస్ చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఆముల నారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ ఆర్శనపల్లి మల్లేశ్వరి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఇరికిల్ల పద్మ శంకరయ్య, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తిరుపతి నాయక్,పాల్గొన్నారు.

ధాన్యంలో తరుగు తీస్తే రైతులు ఫిర్యాదు చేయాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

అప్పన్నపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

నవ తెలంగాణ -పెద్దపల్లి
కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన నాణ్యమైన ధాన్యంలో తరుగు తీస్తే రైతులు వెంటనే ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు.శుక్రవారం పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులతో కలెక్టర్ ముచ్చటించారు.ఎకరానికి ఎంత దిగుబడి వస్తుంది, ఏ రకం ధాన్యం సాగు చేస్తున్నారు, తదితర అంశాలను అడిగి తెలుసు కున్నారు. నిర్దేశించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ప్యాడీ క్లీనర్లను ఉపయోగించి ధాన్యం శుభ్రం చేయాలన్నారు. నాణ్యమైన ధాన్యం విక్రయించే సమయంలో రైతులకు ఎవరైనా తరుగు విధిస్తే వెంటనే కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయాలని, మద్దతు ధర అంశంపై ఫిర్యాదులు ఉంటే 1967 లేదా 1800 425 00 333 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట అప్పన్నపేట ప్యాక్స్ కార్యదర్శి తిరుపతి, వ్యవసాయ విస్తరణ అధికారి శ్వేత, సంబంధిత అధికారులు ఉన్నారు.

కరాటే ఛాంపియన్ షిప్‌లో గాయత్రి విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-8వ సీఎస్ఆర్ఐ కప్-2023 (అండర్-13)లో భాగంగా పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌కు చెందిన జి. హర్షిత (8వతరగతి), కె. గౌతమ్ (5వ), ఎం. కేశవ్ (4వ)లు గోల్డ్ మెడల్స్, పి. అశ్విత్ (6వ), బి. మనీష్ (4వ), ఆర్. దివిజ (5వ), కె హర్షిత లు సిల్వర్ మెడల్స్, పి.గౌతమ్, శ్రీ విద్య, నాగవర్ధన్, శైత్రిక, మన్విత్, నవనీత్, సహానా లు కాంస్య పతకాలు సాధించినట్లు గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకి ఆత్మ రక్షణ ఎలా చేసుకోవాలనే విషయం పట్ల అవగాహన కల్పించాలనే ఆలోచనతో పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు కరాటే శిక్షణ ఇస్తున్నామని అన్నారు.పతకాలను సాధించిన విద్యార్థులను, కరాటే మాస్టర్ రామస్వామి లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, నవీన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
నేడు శనివారం రోజున ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీ సెంటర్, గౌతమి నగర్, రామ్ మందిర్, జనగామ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో గల ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని టీఎస్ఎన్‌పీడీసీఎల్ గోదావరిఖని అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్స్ అడిచర్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

నాగుల చవితి వేడుకలు

సుల్తానాబాద్-నవతెలంగాణ
నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలు స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో గల శివాలయం వద్ద నాగేంద్ర స్వామి పుట్ట వద్ద పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి వివిధ రకాల నైవేద్యాలు పెట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు.



ప్రజా సంపదను దోచుకుంటున్న నాయకులకు గుణపాఠం చెప్పాలి

ఎన్నికల ప్రచారంలో బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష



ప్రచారం నిర్వహిస్తున్న దాసరి ఉష

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్
సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామాలలో బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష గడప గడపకు ప్రచారం నిర్వహించి ఇంటింటా తిరుగుతూ బీఎస్పీ మ్యాని ఫెస్టోలోని సంక్షేమ పథకాలను వివరించారు. పూలే విద్యా దీవెన పథకంతో మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతి మండలం నుంచి ప్రతి ఏటా వందమంది విద్యార్థులకు విదేశీ విద్య అందిస్తామ న్నారు. బ్లూ జాబ్‌కార్డ్ ఏర్పాటు చేసి గ్రామాల్లో, పట్టణాలలో 150 రోజుల ఉపాధి హామీ కల్పించి కనీస రోజు కూలీ 350 రూపాయలు అందిస్తూ కూలీలకు ఉచిత రవాణా ఇస్తూ ఆరోగ్య, జీవిత బీమా పథకాన్ని అమలు పరుస్తామన్నారు. నూరేళ్ల ఆరోగ్య భీమా పథకంతో ప్రతి కుటుంబానికి 15 లక్షల ఆరోగ్య భీమా ప్యాకేజీని అందిస్తూ ఏటా 25,000 కోట్లతో నాణ్యమైన పౌష్టికాహారము అందజేయడం కోసం ఆరోగ్య బడ్జెట్ ఏర్పాటు చేస్తామన్నారు.పెద్దపల్లి నియోజకవర్గంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ప్రజా సంపదను దోచుకుంటూ పబ్బం గడుపుతున్న నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం పలువురు గ్రామ యువకులు పొన్నాల తిరుపతి, కనుకుంట్ల శ్రీనివాస్, దొందుల సందీపు, కుమార్, పొన్నాల కొమురయ్యలు దాసరి ఉష సమక్షంలో పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, స్థానిక గ్రామస్థులు కల్వల రాజు, కనుకుంట్ల రామారావు, తాండ్ర అంజి, కనుకుంట్ల శ్రీనివాస్, పోతర్ల రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

4.060 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడ్డ యువకులు

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తులను రామగుండం టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం గోదావరిఖని-2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోదావరి బ్రిడ్జ్ ప్రాంతంలో నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది అనుమానస్పదంగా బైక్‌లపై వచ్చిన ఐదుగురు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న బ్యాగ్‌లలో 4.060 కేజీల డ్రై గంజాయి లభించిందని, దీని విలువ సుమారు 80,200 రూపాయలు ఉంటుందని తెలిపారు. అనంతరం వారిని విచారించగా వారి పేర్లు గాజుల సిద్దార్థ, దాసరి వినోద్, ఎండీ ఇర్ఫాన్, సతికం శ్రీరామ్ వర్మ, ఎండీ.అజరుద్దీన్‌గా గుర్తించినట్లు తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదగించాలనే దురుద్దేశంతో ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి నుంచి గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, గోదావరిఖని ప్రాంతంలోని స్టూడెంట్స్, యువతకి ఎక్కువ ధరకు అమ్ముతామని తెలిపినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెప్పారు.

ప్రతి ఒక్కరం ఓటేద్దాం ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం

పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి మధుమోహన్

నవ తెలంగాణ -పెద్దపల్లి
అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మధుమోహన్ తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలో అయ్యప్ప స్వామి టెంపుల్ వెనుక వైపు నుంచి కోర్టు చౌరస్తా, మసీద్ చౌరస్తా, జెండా చౌరస్తా మీదుగా అమర్‌చంద్ కళ్యాణ మండపం వరకు దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్‌లతో ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మధుమోహన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం మనుగడ కోసం ప్రతి ఒక్క ఓటరు తప్పనిసరిగా పోలింగ్‌లో పాల్గొనాలన్నారు.ఈ కార్యక్రమంలో స్వీప్ ఆక్టీవిటీస్ జిల్లా నోడల్ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్‌లు, పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇచ్చి.. ఎమ్మెల్యేగా గెలిపించండి

రామగుండం స్వతంత్ర అభ్యర్థి మంచికట్ల దయాకర్



మాట్లాడుతున్న రామగుండం స్వతంత్ర అభ్యర్థి మంచికట్ల దయాకర్

నవతెలంగాణ-గోదావరిఖని:
ఒక్కసారి అవకాశం ఇచ్చి...ఎమ్మెల్యేగా గెలిపించాలని రామగుండం స్వతంత్ర అభ్యర్థి మంచికట్ల దయాకర్ పద్మశాలీ సేవా సంఘాన్ని కోరారు. ఈ మేరకు స్థానిక మార్కెండేయ కాలనీ శివాలయంలో సేవా సంఘం అధ్యక్షులు బండారి రాజమల్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంచికట్ల దయాకర్, ట్రస్ట్ బోర్డు ప్రధాన కార్యదర్శి మంచికట్ల వెంకటస్వామి మాట్లాడుతూ ఐక్యతతో పద్మశాలి యులందరూ పద్మశాలీ కులానికి చెందిన మంచికట్ల దయాకర్ ను గెలిపించుకొందామన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



నవతెలంగాణ జమ్మికుంట : జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆకుల సిద్ధార్థ(16) అనే బాలుడు శుక్రవారం తెల్లవారుజామున ఆటో ట్రాలీ ఢీకొని మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధార్థ ఓ పూల దుకాణంలో కూలీగా పని చేస్తూ అక్కడే పడుకున్నాడు. కృష్ణ కాలనీలో ఉంటున్న తన మిత్రుడు గౌస్ ద్విచక్ర వాహనంపై హుజురాబాద్ వైపు నుండి జమ్మికుంటకు తిరిగి వస్తుండగా ఫ్లైఓవర్ పై ఉన్న ఆటో ట్రాలీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన గౌస్‌కు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అతడి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. బాలుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రమేష్ తెలిపారు.

కాంగ్రెస్ తీరు వల్లే బలిదానాలు

నవతెలంగాణ - హుజురాబాద్ : నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్ర మంత్రి చిదంబరం రాష్ట్ర ప్రకటనను తిరిగి తీసుకోవడం వల్లే తెలంగాణలో వెయ్యిమందికి పైగా యువకులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారని తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పట్టణంలోని సిటీ సెంట్రల్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, నాయకులు వర్తినేని రవీందర్రావు, ఆవాల హరిబాబు, తులసి లక్ష్మణమూర్తి, కొలిపాక శ్రీనివాస్, చింత శ్రీనివాస్‌చ విడపు రాజుచ, బత్తుల సమ్మయ్య, బండ సాయి పాల్గొన్నారు.

బ్యాలెట్ యూనిట్‌పై రిటర్నింగ్ అధికారుల ద్వారా అవగాహన

కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



నవతెలంగాణ - కరీంనగర్ : పోలింగ్ రోజు బ్యాలెట్ యూనిట్‌ల ద్వారా ఓటు వినియోగంపై ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారుల ద్వారా అవగాహనను కల్పిస్తామని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో కరీంనగర్, హుజురాబాద్ నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్ యూనిట్‌ల ర్యాండమైజేషన్ ప్రక్రియ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి పాల్గొన్నారు. కరీంనగర్, హుజురాబాద్‌లలో అభ్యర్థులు అదనంగా ఉండడంతో అందుకు అనుగుణంగా జిల్లాలో నిలువ ఉంచిన 1003 బ్యాలెట్ యూనిట్‌లకు ర్యాండమైజేషన్‌ను నిర్వహించి కరీంనగర్‌కు 488, హుజురాబాద్‌కు 382 బ్యాలెట్ యూనిట్‌లను కేటాయించినట్టు తెలిపారు. ర్యాండమైజేషన్ అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్రమసంఖ్య అధారంగా వేరుచేసి నియోజక వర్గాల పంపిణి కేంద్రాలకు తరలిస్తామని చెప్పారు. కరీంనగర్, హుజురాబాద్ నియోజక వర్గాలలోని ప్రతి పోలింగ్ కేంద్రానికి రెండు బ్యాలెట్ యూనిట్లను ఏర్పాటు చేయవలసి ఉన్నందున, రిటర్నింగ్ అధికారుల ద్వారా అవగాహనను కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ పవన్ కుమార్, ఆయా పార్టీల ప్రతినిధులు సత్తినేని శ్రీనివాస్, నాంపెల్లి శ్రీనివాస్, మిల్కూరి వాసుదేవరెడ్డి, ఎస్.కె.సిరాజ్ హుస్సెన్, గాలి అనిల్ కుమార్, కళ్యాడపు ఆగయ్య పాల్గొన్నారు.

కెప్టెన్ పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ - సైదాపూర్ : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యా లయంలో మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వొడితల లక్ష్మీకాంతరావు పుట్టినరోజు వేడుకలు నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సోమరపు రాజయ్య, ఎంపీపీ సరబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు కొండ గణేష్, ప్యాక్స్ అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, బిల్ల వెంకటరెడ్డి, జిల్లా రైతుబంధు సభ్యుడు చెలమల్ల రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ పోటీలో రెండో స్థానం పొందిన పారమిత విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా

నవతెలంగాణ - కరీంనగర్

ఈ నెల 15, 16 తేదీలలో రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్స్ అండ్ ట్రేనింగ్)లో జరిగిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలలో నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల పదో తరగతి విద్యార్థి అప్పనగారి హరిశేషు గాత్ర సంగీత పోటీలలో బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. రెండో బహుమతి పొందాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా తెలిపారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్యక్రమంలో హరిశేషు మెమోంటో, సర్టిఫికెట్, రూ.1000 నగదు బహుమతి అందుకున్నాడు. రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతి పొందిన హరిశేషు, గైడ్ టీచర్స్ వడిగేపల్లి రంగాచార్యులు, జితుమణిశర్మను పారమిత విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ ఈ.ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రష్మిత, రాకేష్, వీయూఎం ప్రసాద్, వినోద్ రావు, ప్రధానోపాధ్యాయులు రితేష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయకర్త రాము, గైడ్ టీచర్స్ వడిగేపల్లి రంగాచార్యులు, జితుమణి శర్మ పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు తొలిమెట్టు అంశంపై శిక్షణ



నవతెలంగాణ - ఇల్లందకుంట

ఇల్లందకుంటలోని బాలుర ఉన్నత పాఠశాలలో జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలల తెలుగు భాషా ఉపాధ్యాయులకు, ప్రాథమిక పాఠశాల స్థాయి ఇల్లందకుంట మండలంలోని ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు రెండు వేదికల వద్ద స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు తొలిమెట్టుపై, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలపై ప్రత్యేక అవగాహన కల్పించినట్టు మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ తెలిపారు. శిక్షణ కార్యక్రమాలకు జిల్లా పరిశీలకుడిగా ఎన్.శ్రీధర్ హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పకుండా ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టుపైన తెలుసుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో తప్పకుండా అమలు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధిగా పాఠ్య ప్రణాళికలను, పీరియడ్ ప్రణాళికలను సిద్ధం చేసుకుని పరిశీలకులు పాఠశాల సందర్శనకు వచ్చినప్పుడు రికార్డులన్నీ సిద్ధం చేసుకుని చూపాలని తెలిపారు. కార్యక్రమాలకు కోర్స్ డైరెక్టర్లుగా సాంబయ్య, మాలతి, శిక్షణ రిసోర్స్ పర్సన్‌లుగా కె.రవి, బి.సమ్మయ్య, కె.భాస్కర్‌రెడ్డి, లక్ష్మి, కుమారస్వామి వ్యవహరించారు.

ఇక జోరుగా ప్రచారం



- ప్రధాన పార్టీల అగ్రనేతల రాక
- తమ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం

నవ తెలంగాణ-పెద్దపల్లి

జిల్లాలో ఎన్నికల ప్రచార హోరు పెరుగనుంది. పెద్దపల్లి జిల్లాలో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం కోసం అగ్రనేతలు పర్యటించనున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్, బీఎస్పీ కాంగ్రెస్ అగ్ర నాయకుల పర్యటనల తేదీలు ఖరారు అయ్యాయి. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ బీజేపీతో పాటు బీఎస్పీ అభ్యర్థుల ప్రచారం హోరాహోరి సాగనుంది. ప్రధానంగా రామగుండంలో ముఖ్యమంత్రి కేసీఆర్, పెద్దపల్లిలో బీఎస్పీ అధినేత మాయావతి, పెద్దపల్లి, రామగుండంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి పర్యటించనున్నారు.

బరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు

వచ్చే ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం ఈనెల 10 నా నామినేషన్లు, 12న పరిశీలన, 13, ఉపసంహరణ వంటి ప్రక్రియ ఈనెల 14వ ముగిసింది. 15న బరిలో ఉన్న అభ్యర్థులను ప్రకటించారు. పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి,రామగుండం,మంథని నియోజక వర్గాలు ఉన్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ బీఎస్పీతో పాటు బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో ప్రధానంగా పెద్దపల్లి నియోజకవర్గం లో సిట్టింగ్ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, (బీఆర్ఎస్), మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు (కాంగ్రెస్), దుగ్యాల ప్రదీప్‌కుమార్‌రావు(బీజేపీ) దాసరి ఉష (బీఎస్పీ) ఉన్నారు. రామగుండంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కోరు కంటి చందర్(బీఆర్ఎస్),మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్(కాంగ్రెస్), పాలకుర్తి జడ్పీటీసీ సంధ్యారాణి(బీజేపీ), మంథని నియోజకవర్గంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధు(బీఆర్ఎస్),సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్ బాబు(కాంగ్రెస్),చంద్రుపట్ల సునీల్‌రెడ్డి(బీజేపీ) చల్ల నారాయణరెడ్డి(బీఎస్పీ) బరిలో ఉన్నారు. వారితోపాటు చిన్నచిన్న పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు.

- 24న రామగుండంలో ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభ
- నేడు కేటీఆర్ రోడ్ షో
- 25న మంథనిలో కవిత ప్రచారం
- 23న పెద్దపల్లికి బీఎస్పీ అధినేత్రి మాయావతి రాక
- 21, 22న పెద్దపల్లి, రామగుండంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సభలు
- 26, 27 లో కిషన్‌రెడ్డి పర్యటన

ప్రచారానికి అగ్ర నాయకుల రాక

ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల అగ్ర నాయకులు ప్రచారంలో పాల్గొననున్నారు. రామగుండం బీఆర్ఎస్ అభ్యర్థి కోరు కంటి చందర్ తరుపున రామగుండంలో నేడు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో నిర్వహించనున్నారు. 24న రామగుండంలో బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించనున్నారు. 25న మంథనిలో ఎమ్మెల్సీ కవిత 26న కేటీఆర్ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ఆ పార్టీ పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి 20,21,22 తేదీల్లో పెద్దపల్లి రామగుండం, మంథనిలో బహిరంగ సభలు నిర్వహించినట్లుగా సమాచారం. అదేవిధంగా ఈనెల 23న బీఎస్పీ అభ్యర్థుల తరఫున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆ సభకు బీఎస్పీ అధినేత మాయావతి సైతం రానున్నారు. అదేవిధంగా ఈనెల 26 లేదా 27న పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థుల తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితో పాటు కేంద్ర మంత్రులు ప్రచారం చేయనున్నట్లుగా సమాచారం.

ఓటుహక్కు వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలి

కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

నవతెలంగాణ - కరీంనగర్

ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటేసేలా అవగాహన కల్పించాలని, విస్తృత ప్రచారం చేయాలని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో జూనియర్ కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు కలిపి ఓటరు అవగాహన కోసం ప్రత్యేక వర్క్ షాప్, స్వీప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ.. రానున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో భారత ఎన్నికల సంఘం సూచించిన మేరకు ఓటు ప్రాధాన్యతను గురించి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రజలకు వివరించి, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా నవంబర్ 30న జరిగే పోలింగ్‌లో ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలిపారు. చదువుతో పాటు ప్రజాస్వామ్యంపై అవగాహన కలిగి ఉండాలని, 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా గుర్తించబడి, భారత రాజ్యాంగం ద్వారా కల్పించబడిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటును సద్వినియోగం చేసుకోలేనప్పుడు ప్రశ్నించే హక్కును కోల్పోతామని తెలిపారు. విద్యార్థులందరు మరికొంత మందికి ఓటు హక్కును గురించి వివరించాలని కోరారు. భవిష్యత్తులో ఓటు హక్కు పొందే విద్యార్థులు తర్వాతి ఎన్నికలలో మంచి వాతావరణం ఏర్పాటు చేయడానికి దోహదపడతారని, అంతేకాకుండా ప్రస్తుత ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి తోడ్పడుతారని, నిజాయితీతో ఓటింగ్ జరగడంలో తగుపాత్ర వహిస్తారని అన్నారు. జిల్లాలోని 100 కళాశాలలకు సంబంధించిన అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి రామాచారి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ స్వీప్ నోడల్ అధికారి రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



ప్రతి ఇంటికి ఓటర్ స్లిప్పులు అందించాలి

నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రఫుల్ దేశాయ్

నవతెలంగాణ - చొప్పదండి

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్ లెవల్లో బీఎల్‌ఓలు ఓటర్ స్లిప్పులను ఇంటింటికి అందేలా చూడాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. మండలంలోని కొలిమికుంట గ్రామంలో ఇంటింటికి పంపిణీ చేసే ఓటర్ స్లిప్పుల వివరాలను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో 100శాతం ఓటు హక్కును వినియోగించుకునే చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ త్రిపాల్ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఓటర్ స్లిప్పుల పంపిణీని పరిశీలిస్తున్న ఆర్ఓ ప్రఫుల్ దేశాయ్

పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ స్టేషన్‌ను మున్సిపల్ కమిషనర్ పి.శాంతికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఓటర్ల సౌకర్యం నిమిత్తం మెట్లు, ర్యాంపులు, ఎలక్ట్రికల్ లైట్స్, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, కనీస మౌలిక సదుపాయాల ఏర్పాట్లలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మేనేజర్ ప్రశాంత్ కుమార్, ఏఈ రాజేశం, సిబ్బంది ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

ఆరు గ్యారెంటీలపై ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం



నంచర్ల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని నంచర్ల, సుద్దపెల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు సంధి మల్లారెడ్డి, తడగొండ రాజు, ప్రధాన కార్యదర్శి గోగురి సతీష్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, ఎంపీటీసీ సింగసాని విజయలక్ష్మిస్వామి, సర్పంచ్‌లు తాటిపర్తి శోభారాణి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని నంచర్ల, పెగడపల్లి, ఎల్లాపూర్, ఐత్ పల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బండి వెంకన్న కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు గోలి సురేందర్‌రెడ్డి, సర్పంచులు మెరుగు శ్రీనివాస్, ముద్దం అంజలి మల్లేశం, జిట్టబోయిన కొండయ్య, కుంటాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మజీదులలో బీఆర్ఎస్ ప్రచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి సరోజన

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలోని పలు మజీదులలో శుక్రవారం కోరుట్ల ఎమ్మెల్యే సతీమణి సరోజన మైనార్టీ నాయకులతో కలిసి కల్వకుంట్ల సంజయ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రానవేని సుజాత సత్యనారాయణ, వైస్ చైర్మన్ బోయిన్‌పల్లి చంద్రశేఖరరావు, కౌన్సిలర్ వజ్జగిరి శ్రీనివాస్ కౌన్సిలర్ మన్నే ఖాన్,మార్గం గంగాధర్ పాల్గొన్నారు.

సాన్నం చేయిస్తాం.. ఓట్లు అడుగుతాం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి పెంట లింబద్రి, యామాపుర్ సహకార సంఘ చైర్మన్ అంకతి రాజన్న, ఉపసర్పంచ్ ఆసతి పెద్ద రాజం, రైతుబంధు అధ్యక్షుడు పోతరాజు శివరాం ప్రచారంలో భాగంగా ఓ వ్యక్తి వద్దకు వెళ్లి సాన్నం చేయిస్తూ ఓట్లు అడిగారు.



కొప్పుల ఈశ్వర్ ప్రజా ఆశీర్వాద యాత్ర



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ-ఎండపల్లి /బుగ్గారం

ఎండపల్లి మండలంలోని పాతగూడూరు, శానబండ గ్రామాల్లో బీఆర్ఎస్ ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూన మల్ల లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, మండల అధ్యక్షుడు జగన్, మాజీ ఎంపీపీ అంజయ్య పాల్గొన్నారు.

బుగ్గారం: మండలంలోని గంగాపూర్, యశ్వంత్రావుపేట్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద యాత్రలో కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని మాట్లాడుతున్న కాంగ్రెస్ 50 సంవత్సరాల పరిపాలన కాలంలో చేసింది శూన్యమని, మళ్లీ అవకాశం ఇస్తే భవిష్యత్తు కూడా చీకటి రాజ్యం అవుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెల్లటూరి మమత-రమేష్,గంగాపూర్ సర్పంచ్ దొరగాండ్ల జగన్, యశ్వంతరావుపేట సర్పంచ్ కోల రాజు,జెడ్పిటిసి బాదినేని రాజేందర్, ఎంపీపీ రాజమణి,వైస్ ఎంపీపీ జోగినిపల్లి సుచందర్,మండల కో- ఆప్షన్ నెంబర్ అబ్బుల్ రహమాన్, ఎంపీటీసీ ఉరిమల్ల లక్ష్మి-బుచ్చన్న, ఉప సర్పంచ్ అప్పర్,బారాస యాత్ విభాగం అధ్యక్షులు కట్ట రాజేందర్ పాల్గొన్నారు.

వంజరపల్లిలో బిఆర్ఎస్ ప్రచారం



ఓటర్లతో మాట్లాడుతున్న జడ్పీచైర్‌పర్సన్

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

జగిత్యాలరూరల్ మండలంలోని వంజరపల్లి గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌కు మద్దతుగా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సతీమణి రాధిక ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రజిత గంగాధర్, బాల ముకుందం, రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ మహేష్, ఉప సర్పంచ్ ప్రణవి, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, గ్రామ శాఖ అధ్యక్షులు తిరుపతి, గంగారెడ్డి నాయకులు మహేష్, వెంకన్న రాజు, హరీష్, లింగం, మల్లయ్య, లింగం, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

లోకల్ నాయకులకు ప్రజలు పట్టం కట్టాలి

ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్

నవతెలంగాణ-మల్లాపూర్

స్థానికంగా ప్రజలలో ఉండి ప్రజాసేవ చేసే నాయకులను ప్రజలు గెలిపించాలని బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం చిట్టాపూర్, గుండంపల్లి, సాతారం, రేగుం ట, గొర్రెపల్లి, వీవీరావుపేట గ్రామాల్లో రోడ్ షో నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, ఇరు గ్రామాల సర్పంచులు, మల్లు సంతోష్ యాదవ్, సుమలత, నరసయ్య సరోజన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్

ముదిరాజ్ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం



ముదిరాజ్ కులస్తులతో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఓ మామిడి తోటలో తిరుమల నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ రానవేని సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్ బాబు, కోరుట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, సర్పంచులు నేమూరి లత, జంగిటి అంజయ్య, కాట శ్రీధర్, సంఘం సాగర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోసకంటి వెంకట్ పాల్గొన్నారు.

గుండె పోటుతో రైతు మృతి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

వరి ధాన్యం ఆరబోసిన కల్లం వద్ద రైతు గుండె పోటుతో మృతి చెందాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో శుక్రవారం జరిగింది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన అకుల రాజారాం (57) రైతు సీడ్స్ వరి కోసి ధాన్యాన్ని యామాపుర్- వేములకుర్తి శివారులోని హైలెవల్ వంతెన పక్కన పోశాడు. శుక్రవారం సాయంత్రం వడ్లు సంచుల్లో నింపుతుండగా ఒక్కసారిగా క్రింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



కల్లం వద్ద రైతు మృతదేహం

ఆటో బోల్తా.. ప్రయాణికులకు గాయాలు

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణ శివారులోని వెల్లుల్ల రోడ్డులో శుక్రవారం సాయంత్రం జగ్గసాగర్ వెళ్తున్న ఆటో పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట కుక్కను తప్పించబోయి అదుపు తప్పి పాల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వెంటనే అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అంబులెన్సుకి సమాచారం అందించి వారిని ఆస్పత్రికి తరలించారు.మరో ముగ్గురిలో ఇద్దరినీ జగిత్యాలకు, ఒకరిని నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆటోలో కేపాసిటిని మించి ప్రయాణికులను తరలించడమే కారణమని స్థానికులు తెలిపారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి



మాట్లాడుతున్న నర్సింగరావు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

శాసనసభ ఎన్నికల్లో ఒకసారి అవకాశమిచ్చి ఆశీర్వదించాలని కోరుట్ల కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు ఓటర్లను అభ్యర్థించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని గోధూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, పకీర్ కొండాపూర్, మూల రాంపూర్, ఎర్దండి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ తెలంగాణ జన సమితి కన్వీనర్ కంతి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడా శ్రీకాంత్, మాజీ ఉపసర్పంచులు పాల్గొన్నారు.

జువ్వాడి కృష్ణారావు ప్రచారం



మాట్లాడుతున్న కృష్ణారావు

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, పొంద్ర శ్రీనివాస్‌రెడ్డి అల్లూరి మహేష్ రెడ్డి, విజయేందర్‌రెడ్డి, రఘు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఏనుగు రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సమక్షంలో చేరికలు

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మల్లాపూర్ మండలంలోని పాత ధామ్‌రాజ్‌పల్లి గ్రామానికి చెందిన యువకులు ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

నవతెలంగాణ-కథలాపూర్

కాంగ్రెస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సమాజ సేవకులు, ఎన్.ఆర్.ఐ కాంగ్రెస్ నాయకులు బైర దేవ్ యాడ్స్ అన్నారు. శుక్రవారం దాదాపు 600 మందితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు నాయకులు కాయితి నాగరాజు, మొహమ్మద్ అజీమ్,తొట్ల అంజయ్య, వెలిచాల సత్యనారాయణ, గోపిడి ధనుంజయ్ రెడ్డి, అల్లూరి దేవారెడ్డి, మార్గం శ్రీనివాస్, హరి ప్రసాద్, పాల్తెపు గంగారాం,ఆకుల సంతోష్ పాల్గొన్నారు.